క్లుప్తంగా

చదువును అశ్రద్ధ చేయొద్దు



ప్రత్తిపాడు: చదువును అశ్రద్ధ చేయకుండా, క్రమం తప్పకుండా విద్యార్థులంతా పాఠశాలకు హాజరుకావాలని ఎంఈవో సీహెచ్. రమాదేవి తెలిపారు. ప్రత్తిపాడు ఎల్ఈ పాఠశాలను బుధవారం ఆమె ఎంఈవో-2 లీలారాణితో కలసి తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న వైఎస్సార్ కాలనీ చిన్నారులతో మాట్లాడారు. వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. నిత్యం పాఠశాలకు ఎందుకు హాజరు కావడం లేదని, తోటి విద్యార్థుల గైర్హాజరుకు కారణాలేమిటని ప్రశ్నించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎస్టీ కాలనీ చిన్నారులు బడి మానివెయ్యకుండా ప్రతి రోజూ పాఠశాలకు వచ్చేలా హెచ్ఎం సహా ఉపాధ్యాయులంతా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు.

వెనిగండ్ల సర్పంచికి షోకాజ్ నోటీసులు

పెదకాకాని: నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసిన కారణంగా సర్పంచికి జిల్లా పంచాయితీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల పంచాయతీ సర్పంచి వేల్పుల శ్రావణి ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన వల్లబాపురపు ప్రేమ్‌సాగర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. సాధారణ నిధులతో పాటు 14, 15 ఆర్థిక సంఘం నిధుల్ని నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు అందులో ఆయన పేర్కొన్నారు. దీనిపై మూడు నెలల్లోగా సమాధానం తెలియాలని అధికారుల నుంచి సర్పంచికి ఆదేశాలు జారీ అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: వాహనం అదుపు తప్పి, బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరికి జిల్లా ఉండ్రాజవరం మండలం పెప్పర్రు గ్రామానికి చెందిన రెల్లి వీరాంజనేయులు(35) పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసే వ్యక్తి వద్ద ముఠా పని చేస్తుంటాడు. అతనితో పాటు మరో నలుగురు ప్రకాశం జిల్లాకు వచ్చి, పాత ఇనుప సామానును బొలెరో వాహనంలో తీసుకు వెళుతున్నారు. ఎన్‌హెచ్ 16లో బుడంపాడు వద్ద వేగంగా వెళుతున్న వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరాంజనేయులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. బాధితుల్ని 108లో జీజీహెచ్‌కు తరలించారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై మృతుని తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సేవాసదన్‌కు అనాథ తరలింపు



గుంటూరు మెడికల్: అన్నం నీరు లేక జీవచ్ఛవంలా పడిఉన్న వ్యక్తిని ఆశ్రమంలో చేర్పించినట్లు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు చెప్పారు. నగరంలోని కోడిగుడ్ల సత్రం వద్ద బుధవారం ఉదయం నడిరోడ్డు మీద వ్యక్తి పడి ఉన్నాడని ఫోన్ కాల్ రావడంతో స్పందించి ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. వెంటనే అతడ్ని అక్కడ నుంచి తరలించి గోరంట్లలోని కార్మెల్ సేవా సదన్‌లో చేర్పించినట్లు ట్రస్టు సభ్యులు పఠాన్ అల్లాహ్ బక్షు, ఆటోగాస్, షేక్ షఫీ, పఠాన్ ముజీబ్‌బాషా, షేక్ యూసూబ్, సమీఉల్లా తెలిపారు.

పోరాటాలు, ఉద్యమాల గొంతుక గద్దర్



నెహ్రూనగర్: దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజల సమస్యలపై అనేక పోరాటాలకు, ఉద్యమాలకు తన గొంతుక ద్వారా ఊపిరి పోసిన ప్రజా నాయకుడు గద్దర్ అని చార్వాక యువజన సంఘం అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ పేర్కొన్నారు. గద్దర్ జయంతిని పురస్కరించుకుని చార్వాక యువజన సంఘం ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరం బాబు మాట్లాడుతూ గద్దర్ పాటలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

- ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చిన్న ఇటికెంపాడులో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష తదితర కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని నండూరు చిన్న ఇటికెంపాడులో బుధవారం రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక ప్రమాణాలతో మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో నూతన ఆరోగ్య కేంద్రాల్ని నిర్మించిందని తెలిపారు. పేదలకు పైసా ఖర్చు లేకుండా వీటి ద్వారా ఉచిత వైద్యం మరింత అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి క్లినిక్‌లోనూ బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ను నియమించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్లినిక్‌లలో 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, 65 రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇక్కడే టీకాలు వేయించుకోవచ్చని, అన్ని రకాలు ఇక్కడే అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రభుత్వం భావించి గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్యసేవల్ని విస్తృతంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీకి చెందిన 40 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. స్థానిక సంఘ పెద్ద గుంటూరు బాబు ఆధ్వర్యంలో కొమ్మూరి ఏసుబాబు, కారుమూరి నాగేశ్వరరావు, మోహనరావు, బుజ్జి, దిలీప్, మార్క్ కనకయ్య, శివయ్య, మరియదాసు, శేషయ్య, చెంచు, దానబాబు, యాకోబు తదితర కుటుంబాలకు చెందిన వారు చేరారు. శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పట్టాలను అందజేసిన స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య చొరవతో చేరినట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

90మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఇంటి వద్దకే అందిస్తున్నట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో 90మందికి బుధవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, సర్పంచ్ అత్తోట వినీతారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా పాములు, చందు సాంబశివరావు, ఎంపీటీసీ ఇంటూరి జయపాల్‌రెడ్డి, ఆదాం గాదె కేశవరెడ్డి, పుల్లారెడ్డి, విజయకుమార్, అప్పిరెడ్డి, చౌడయ్య పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ఆసరా

- ప్రత్తిపాడు సమన్వయకర్త కిరణ్‌కుమార్, మేయర్ కావటి
- గుంటూరు అర్బన్ మండల ఆసరా చెక్కుల పంపిణీ

గుంటూరు రూరల్: అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అద్భుత సంక్షేమ పథకం ఆసరా అని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మిర్చి యార్డు వై.జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో గుంటూరు అర్బన్ మండలం పొదుపు సంఘాలకు చెక్కు పంపిణీలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న మహిళలకు చేసిన ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ఆసరా నాలుగో విడత అందించినట్లు చెప్పారు. జగనన్న మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడంతే అన్నారు. అన్నట్టే చెప్పిన మాటను చేసి చూపే ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా మళ్లీ ఊపిరి పోశారని తెలిపారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు రూ. 10.5 కోట్ల చెక్కును అందజేశారు. నగర మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని చంద్రబాబు పొదుపు సంఘాల మహిళల్ని ఏ విధంగా మోసం చేశారో వివరించారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేశారని తెలిపారు. జగనన్న మహిళా పక్షపాతి అని, ప్రతి పథకాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నారని చెప్పారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్బన్ మండలంలోని కార్పొరేటర్లు, డివిజన్ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, పొదుపు సంఘాల ఆర్పీలు, వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొదుపు సంఘాల మహిళలకు చెక్కును అందజేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

పేదల ఇంటి స్థలం బదలాయింపు దస్తావేజులు సిద్ధం

- గొడవర్రు గ్రామానికి చెందిన మహిళ డాక్యుమెంటు రెడీ
- చేబ్రోలు తహసీల్దారును అభినందించిన కలెక్టర్, జేసీలు



గొడవర్రుకు చెందిన భానుప్రియతో తహసీల్దారు గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది

చేబ్రోలు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన వారికి స్థలం సంపూర్ణ శాశ్వత హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. గత కొద్దిరోజులుగా సాంకేతిక కారణాలతో సమస్యలు ఏర్పడటంతో పనులు నిలిచిపోయాయి. మూడు జిల్లాల పరిధిలో మొట్టమొదటి డాక్యుమెంటును చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన భానుప్రియ పేరుమీద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ తెలిపారు. సాంకేతిక సమస్యల అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించిన తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణతో పాటు రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి తదితరులు అభినందించారు. ఇళ్ల స్థలాలు పొందిన వారందరికీ ఈ నెల 9వ తేదీలోపు బదలాయింపు దస్తావేజులు అందించటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

శివాలయంలో షాపుల నిర్వహణకు వేలం పాటలు



పెదకాకాని: స్థానిక శివాలయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను బుధవారం ఈ– టెండరు, సీల్డ్ టెండరు, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. పొన్నూరు శ్రీ భావన్నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, ధర్మకర్తల మండలి చైర్మన్ ఎ. శివశంకరరావు, సభ్యుల సమక్షంలో మొత్తం 24 అంశాలకు గాను 11కు పాటలు నిర్వహించారు. టెంట్ హౌస్ నిర్వహణ రూ. 6,80,000, కొబ్బరికాయల షాపు రూ.60,03,000, గ్యాస్ స్టౌవ్‌లు అద్దెకు రూ.15,00,300 చొప్పున పలికింది. గోశాల వద్ద పచ్చిగడ్డి విక్రయ పాటకు రూ.1,50,000, విభూది విక్రయ పాట రూ. 42,000 చొప్పున నగదు చెల్లించేలా పాటల్లో దక్కించుకున్నారు. దేవస్థానానికి శేష వస్త్రాలు, పూలు, స్టేషనరీ, ప్రింటింగ్, కూరగాయలు, పాలు సరఫరాకు టెండరు ఖరారు చేసినట్లు ఏసీ ఎస్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలియజేశారు.

నేడు ప్లాటినం జూబ్లీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పెదకాకాని: శ్రీ వేమన ప్రోలయ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు ప్లాటినం జూబ్లీ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి తెలిపారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో చేపడుతున్న కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య, శాసనమండలి సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి తెలియజేశారు.

3 సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 3న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీత విభావరి, అనంతరం సభలో మిరాకిల్స్ వరల్డ్ రికార్డు సంస్థ జ్యూరీ సభ్యులుగా ఎంపికైన డాక్టర్ పట్టాభి కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీలో బేస్‌బాల్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలు శారీరక బలంతో పాటు, మానసిక స్థైర్యానికి దోహదపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో రెండు రోజులపాటు జరగనున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బేస్ బాల్ (మెన్) టోర్నమెంట్ పోటీలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, వాటిని తేలిగ్గా తీసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీల్ని ప్రారంభించారు. నాక్ అవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తొలిరోజు జరిగిన పోటీల్లో నాక్‌అవుట్ విభాగం ముగించుకున్న అనంతరం గురువారం జరిగే లీగ్ మ్యాచ్‌లలో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల, చిలకలూరిపేట సీఆర్ కాలేజీ, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫిజికల్(ఏఎన్‌యూ), పిడుగురాళ్ల స్కాలర్ కాలేజీ జట్లు తలబడనున్నాయని టోర్నమెంట్ ఆర్గనైజర్ పి. గౌరీశంకర్ తెలిపారు. బేస్ బాల్ క్రీడాకారులు విజయసాధన కోసం తీసుకొనే వ్యూహాత్మక నిర్ణయాలు వారి నైపుణ్యాభివృద్ధికి దోహదపడతాయని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి.శ్రీనివాస్, ఏఎన్‌యూ సెలక్టర్లు పి.శ్రీనివాస్, బుచ్చిబాబు, పీడీ ఎం.శివ రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాలను నోటిఫై చేయాలి

కలెక్టర్‌కు ఏపీ ఎన్జీవో నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: తాడేపల్లి, మంగళగిరి ప్రాంతం నుంచి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలను నోటిఫై చేస్తే ఉద్యోగులందరికీ ఇంటి అద్దె అలవెన్స్ 16 శాతం క్లెయిమ్ చేయడానికి అవకాశం ఉంటుందని ఏపీ ఎన్జీవో నేతలు తెలిపారు. ఈ మేరకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్ బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తాడేపల్లి, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రభుత్వం 12 నుంచి 16 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. వెంటనే ఆయా గ్రామాలను నోటిఫై చేయాలని కలెక్టర్‌ను నేతలు కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రామాలను త్వరితగతిన నోటిఫై చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. వెంకటరెడ్డి, డి.నాయక్, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, కోశాధికారి ఎల్.శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కె.లక్ష్మీ రమ్య, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కె.మురళీకృష్ణ, దుర్గారావు ఉన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళిక అవసరం

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఏఎన్‌యూ: ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితేనే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో జరిగిన గ్రూప్–2 అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం వివిధ పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు వచ్చాయని, వాటికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం అయితే విజయాలు సాధ్యమవుతాయని సూచించారు. అనుకున్న లక్ష్యాలు పొందేందుకు ప్రతి ఒక్కరూ వారు ఎంచుకున్న సబ్జెక్టుపై కనీస అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సామాజిక స్థితిగతులు పరిశీలన చేయాలని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్యం దిశగా పయనిస్తే ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన గ్రూప్– 2 మెటీరియల్‌ను 500 మందికి ఉచితంగా అందజేశారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ అంజిరెడ్డి, తక్షశిల ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు నమిత, యూనివర్సిటీ అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ ఆదిశేషు, భార్గవి, అజయ్, ఆకాష్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



డిమాండ్లు ప్రదర్శిస్తున్న దళిత క్రైస్తవ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దళిత, క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950 నుంచి క్రైస్తవం, ముస్లిం మతం తీసుకున్న ఎస్సీలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. 70 సంవత్సరాలుగా తమకు ఎస్సీ హోదా కల్పించాలని దేశ రాజధాని ఢిల్లీలో అనుదినం ఉద్యమం చేస్తున్నా, ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలను దళిత, క్రైస్తవులకు కేటాయించాలన్నారు. ప్రధానంగా గుంటూరు లోక్‌సభ స్థానాన్ని సుమారు 21 శాతంగా ఉన్న దళిత క్రైస్తవులకు కేటాయించాలని కోరారు. పార్టీలు స్పందించని పక్షంలో దళిత క్రైస్తవులే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్య నాయకులు గద్దం సురేష్, గోరపాటి అజయ్, రాయపూడి చిన్నరాజు, రాయపూడి మరియదాసు, నల్లపు నీలాంబరం, పాల్‌కుమార్, సురేష్ జేమ్స్, వేముల భారతి, ప్రేమకుమారి, సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ



సభలో మాట్లాడుతున్న రవీంద్రబాబు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ షిర్డీ సాయి దీనజన సేవాసమితి అంధుల పాఠశాలలో సినీ నటుడు డాక్టర్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు పురస్కరించుకొని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు అన్వర్ బాషా, శంకర్‌రెడ్డి, ఎం. రమేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవాతత్పరులు ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సామాజిక సేవాభావాన్ని పెంపొందిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సేవాతత్పరులని ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ''ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు–సామాజిక బాధ్యత'' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ ప్రగతి పథంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల సేవలు మరువలేనివని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేస్తూ స్వామి వివేకానంద, మదర్ థెరీస్సా అడుగుజాడల్లో నడవాలని సూచించారు. వికాస్ హాస్పిటల్స్ సీఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవాభావంతో సాటి మనిషికి సాయం చేసే తత్వాన్ని కలిగిన అధ్యాపకులు దైవంతో సమానమని తెలిపారు. ప్రొఫెసర్ ఎన్‌పీడీ పాల్ మాట్లాడుతూ సేవా దృక్పథం ఉంటేనే ఎన్‌ఎస్‌ఎస్‌లోకి రావాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని, సేవాభావం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జీవీ సుధీర్‌కుమార్, వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌గా వేమారెడ్డి

పట్నంబజారు: గుంటూరు దిశ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఈ.వేమారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పలు స్టేషన్ల సీఐగా పనిచేసిన ఆయన గతంలో గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా దిశ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులైన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

డెప్యూటీ కమిషనర్- 1గా వెంకటలక్ష్మి



కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న వెంకటలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ – 1గా డి. వెంకటలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటిదాకా డెప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన బి. శ్రీనివాసరావు సీడీఎంఏ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

అదనపు కమిషనర్‌గా రాజ్యలక్ష్మి

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె. రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. లక్ష్మీశివజ్యోతి గోపాలపురానికి బదిలీపై వెళ్లనున్నారు.